
సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 5 । ఏప్రిల్ । 2025



చేదెక్కుతున్న మామిడి
మామిడికి గడ్డు పరిస్థితులు దాపురించాయి. ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. దీంతో రైతులు **లబోదిబోమంటున్నారు.** 8లో ▸



అనుమానాస్పద స్థితిలో..
పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ముసునూరు మండలం గుళ్లపాడు శివారులో చోటుచేసుకుంది. 8లో ▸



వేసవిలో పిల్లల ఆరోగ్యం జాగ్రత్త
వేసవిలో చిన్నారులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

గోవిందకుంట చెరువులో మట్టి దందా



పొక్లెయిన్‌తో గట్టును తవ్వేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: స్థానిక పంచాయతీకి చెందిన గోవిందకుంట చెరువులో మట్టి అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు రాత్రీపగలూ తేడా లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్నారు. ప్రధానంగా జేసీబీ, ట్రాక్టర్ల యజమానులు తవ్వకాలు జరుపుతూ కొందరు కూటమి నేతలకు ట్రాక్టర్‌కు ఇంతని ముట్టచెబుతున్నట్టు సమాచారం. దూరాన్ని బట్టి ట్రాక్టర్ మట్టిని రూ.700 నుంచి రూ.900కి విక్రయిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వైపు నుంచే మట్టి ట్రాక్టర్లు వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువు గట్టును సైతం అక్రమార్కులు తవ్వేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

నేడు పాఠశాలలకు సెలవు
ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. అలాగే ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సెలవు అని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం
భీమవరం (ప్రకాశం చౌక్): రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్లాట్ బుకింగ్ విధానం జిల్లాలో అమలులోకి వచ్చింది. పైలెట్ ప్రాజెక్టుగా భీమవరంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ విధానాన్ని శుక్రవారం ప్రారంభించారు. స్లాట్ బుక్ చేసుకున్న 15 రోజుల వ్యవధిలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌కు 250 మంది హాజరు
ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సిద్దార్థ క్వెస్ట్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్–2 పరీక్షలకు 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్టులో 115 మందికి 106 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 152 మందికి 144 మంది హాజరయ్యారు.

ఆటో డ్రైవర్ల ఆక్రందన




ఏలూరులో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): రాపిడో, ఉబర్, ఓలా సంస్థల అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరులో ఆటో డ్రైవర్లు గళమెత్తారు. శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థలు కాల్ సెంటర్‌ను ఏర్పాటుచేసుకుని కోట్లాది రూపాయలు ఆటో డ్రైవర్ల ఆదాయాన్ని కొల్లగొడుతున్నాయని మండిపడ్డారు. కేరళలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం సవారీ యాప్ ద్వారా ఆటో, టాక్సీ డ్రైవర్లకు 6 శాతం కమీషన్‌కు సేవలందిస్తోందని, అయితే మన రాష్ట్రంలో రాపిడో వంటి సంస్థలు 25 నుంచి 30 శాతం కమీషన్లు గుంజుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పేదలను ఉద్ధరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్లకు దోచిపెడుతోందని ధ్వజమెత్తారు. రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు కేరళ, తమిళనాడు తరహాలో ఆన్‌లైన్ యాప్ తయారు చేయాలన్నారు.

గోనె సంచుల పంపిణీ బాధ్యత మిల్లర్లదే
ఏలూరు(మెట్రో): రైతుల నుంచి ధాన్యం సేకరణలో భాగంగా సీఎంఆర్‌లో పాల్గొనే మిల్లుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు పంపాల్సి ఉంటుందని జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రతాప్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ముదినేపల్లి మండలం పెదగొన్నూరులోని గౌతమి రా అండ్ పార్ బాయిల్డ్ రైస్ మిల్ నుంచి భీమడోలు మండలంలో పూళ్ల–1 రైతు సేవా కేంద్రానికి 10 వేల గోనె సంచులు పంపారన్నారు. అయితే ప్రతి కట్టలో 20కి పైగా సంచులు చిరిగిపోయి ఉండటంతో సదరు రైస్‌మిల్లర్‌ను బాధ్యత వహించాల్సిందిగా తెలుపుతూ షోకాజ్ నోటీస్ జారీ చేశామన్నారు. అలాగే జిల్లాలో సీఎంఆర్‌లో పాల్గొనే మిల్లర్లంతా గోనె సంచులు తప్పక పంపాలని తెలిపారు.

సర్కారు నిర్లక్ష్యం.. పౌల్ట్రీకి శాపం



బర్డ్‌ఫ్లూ వైరస్ నియంత్రణలో కూటమి సర్కారు నిర్లక్ష్య ధోరణి పౌల్ట్రీ రంగానికి శాపంలా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బర్డ్‌ఫ్లూ పంజా విసరడంతో కోళ్ల పరిశ్రమ కుదేలైంది. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న పరిస్థితుల్లో తాజాగా నరసారావుపేటలో బర్డ్‌ఫ్లూతో చిన్నారి మృతి చెందిన ఘటన కోళ్ల రైతులను కలవరపరుస్తోంది.

కోడికి కష్టకాలం
- నరసరావుపేట ఘటనతో కలకలం
- మరలా బర్డ్‌ఫ్లూ భయం
- వైరస్ నియంత్రణలో కూటమి నిర్లక్ష్యం
- జిల్లాలో బర్డ్‌ఫ్లూ బాధిత రైతులకు అందని సాయం
- విడుదల కాని నష్టపరిహారం.. రీషెడ్యూల్ కాని రుణాలు

సాక్షి, భీమవరం: జిల్లాలో బర్డ్‌ఫ్లూతో నిండామునిగిన రైతులకు ఇప్పటికీ ప్రభుత్వ సాయం, నష్టపరిహారం అందించలేదు. కనీసం బ్యాంకు రుణాలు కూడా రీషెడ్యూల్ చేయకపోవడంతో కొత్త బ్యాచ్‌లు వేయలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

200 పౌల్ట్రీలు.. 1.30 కోట్ల కోళ్లు

ఉమ్మడి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, అత్తిలి, ఇరగవరం, ఉంగుటూరు, దేవరపల్లి, ఉండ్రాజవరం తదితర మండలాల్లో దాదాపు 200 పౌల్ట్రీల్లో 1.30 కోట్ల వరకు లేయర్ కోళ్లు ఉన్నాయి. రోజుకు 1.05 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. మరోపక్క ఏడు లక్షల వరకు బ్రాయిలర్ కోళ్లు పెంచే షెడ్లు ఉన్నాయి. సంక్రాంతికి ముందు నుంచే జిల్లాలోని నాటు కోళ్లు, పందెం పుంజులు వైరస్ లక్షణాలతో మృత్యువాత పడగా శీతల ప్రభావం వలన చనిపోతున్నాయని అధికారులు కొట్టిపారేస్తూ వచ్చారు. తర్వాత బర్డ్‌ఫ్లూ వైరస్ లేయర్, బ్రాయిలర్ ఫారాలకు విస్తరించింది. జిల్లాలో అసాధారణ రీతిలో కోళ్ల మరణాలు సంభవిస్తుండటంపై ఫిబ్రవరి 4న 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఉంగుటూరు మండలం బాదంపూడి, తణుకు మండలం వేల్పూరులో కోళ్ల మరణాలకు ఎవియాన్ ఇన్‌ఫ్లూయంజ్ (హెచ్5ఎన్1) వైరస్ కారణమని ల్యాబ్ నివేదికలు తేల్చాయి. వైరస్ గుర్తించిన పౌల్ట్రీకి కిలోమీటరు పరిధిలో ఇన్ఫెక్షన్ జోన్, పది కిలోమీటర్లు పరిధిని అలర్ట్ జోన్‌గా గుర్తించి కొద్దిరోజులపాటు చికెన్, గుడ్లు అమ్మకాలపై అధికారులు నిషేధం విధించారు.

కోళ్ల పరిశ్రమకు తీవ్ర నష్టం
బర్డ్‌ఫ్లూ వెలుగుచూసే నాటికి ఫాంగేట్ వద్ద గుడ్డు ధర రూ.5.05 ఉంది. ఆంక్షల నేపథ్యంలో స్థానిక వినియోగంతో ఎగుమతులు తగ్గడంతో ఫిబ్రవరిలో రూ.4.10కి పడిపోయింది. చికెన్ ధరలు సైతం కిలో రూ.100కి తగ్గి కోళ్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు పట్టణ ప్రాంతాల్లో చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించారు. ధర లేకపోవడం, ఎండలకు జడిసి బ్రాయిలర్ రైతులు కొత్త బ్యాచ్‌లు తగ్గించడంతో మార్కెట్‌లో కోళ్ల సంఖ్య తగ్గింది. రంజాన్ మాసం మొదలు కావడం, బర్డ్‌ఫ్లూ లేదని నిరభ్యంతరంగా చికెన్ తినవచ్చంటూ అధికారులు ప్రకటించడంతో కొద్దిరోజులుగా వినియోగం పెరిగింది.



చనిపోయిన కోళ్లను కల్లింగ్ చేస్తున్న పశుసంవర్థక శాఖ అధికారులు (ఫైల్)

కలకలం రేపిన చిన్నారి మృతి

పల్నాడు జిల్లా నరసరావుపేటలో రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూతో మృతిచెందడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఈ ప్రభావం పౌల్ట్రీ రంగంపై పడింది. దీంతో చికెన్, గుడ్డు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. రెండు రోజుల క్రితం ఫాంగేట్ వద్ద రూ.4.60 ఉన్న గుడ్డు ధర శుక్రవారం రూ.4.25కి తగ్గిపోయింది.

మరింత సంక్షోభంలోకి..

ప్రభుత్వం సకాలంలో వైరస్‌ను గుర్తించి, కట్టడికి చర్యలు చేపట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదని పలువురు విమర్శిస్తున్నారు. మరోపక్క పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కోళ్ల రైతులకు గుబులు పుట్టిస్తున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువైతే వడదెబ్బకు గురై కోళ్ల మరణాలు పెరగడంతో పాటు 10 నుంచి 20 శాతం వరకు గుడ్ల ఉత్పత్తి పడిపోతుందంటున్నారు. రానున్న రోజుల్లో పరిశ్రమ మరింత సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకోని ప్రభుత్వం

వైరస్ గుర్తించక ముందు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 15 లక్షల వరకు లేయర్, 50 వేల వరకు బ్రాయిలర్ కోళ్లు మృతిచెందినట్టు అంచనా. వైరస్ గుర్తించాక వేల్పూరు ఇన్ఫెక్షన్ జోన్‌లోని 55వేలు, బాదంపూడి ఇన్ఫెక్షన్ జోన్‌లోని 1.34 లక్షల లేయర్ కోళ్లను కల్లింగ్ చేశారు. గుడ్లు, మేతలను పూడ్చిపెట్టేశారు. ఒక్కో కోడికి రూ.140 నష్టంగా అధికారులు ప్రాథమికంగా లెక్కకట్టారు. ఈ మేరకు పూడ్చిపెట్టిన కోళ్లకు రూ.2.65 కోట్లు, అలాగే గుడ్లు, మేతల రూపంలో మరింత మొత్తం బాధిత రైతులకు అందించాల్సి ఉంది. అయితే ఇప్పటికీ ప్రభుత్వం పరిహారం అందించలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రుణాలు రీషెడ్యూల్ చేయకపోవడంతో కొత్త బ్యాచ్‌లు వేయలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

నష్టపరిహారం రావాల్సి ఉంది

బర్డ్‌ఫ్లూ కారణంగా జిల్లాలో జరిగిన నష్టం వివరాలపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే సంబంధిత రైతులకు అందజేస్తాం. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదు.

– కె.మురళీకృష్ణ, పశుసంవర్ధకశాఖ జేడీ, పశ్చిమగోదావరి జిల్లా

బరి తెగించారు
● కాలువ గట్లపై ఆక్వా చెరువులకు బోర్లు ● అధికారుల అండదండలతో ఇష్టారాజ్యం



ఉండి శివారు ఉప్పగుంట పరిధిలో కాలువ గట్టుపై ఆక్వా చెరువుకు బోరు వేసిన దృశ్యం

ఉండి: కూటమి ప్రభుత్వంలో అధికారుల అండదండలతో కొందరు ఆక్వా రైతులు చెలరేగిపోతున్నారు. ఇప్పటికే పంట బోదెలు, పంట కాలువలు, డ్రైయిన్లు, ప్రభుత్వ భూములను ఆక్రమించి చెరువులు తవ్వేస్తుండగా.. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి పంట కాలువ గట్లపై ఏకంగా ఆక్వా చెరువులకు బోర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇంతలా బరితెగిస్తున్నా అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. ఉండి శివారు ఉప్పుగుంట నుంచి అర్తమూరు వెళ్లే పంట కాలువ గట్టును ఓ వైపు పూర్తిగా ఆక్వా రైతులు ఆక్రమించుకున్నారు. గట్టుపై సుమారు 15 వరకు బోర్లు వేశారు. మండలంలోని ఓ గ్రామంలో ఆక్వా చెరువుకు బోరు వేస్తున్న సంగతిని కొందరు రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మేం ఇద్దరు అధికారులతో మాట్లాడుకున్నాం.. మమ్మల్ని ఎవరూ ఏం చేయలేరు.. మా బోర్లు ఎవరూ తొలగించలేరని సదరు ఆక్వా రైతు నుంచి సమాధానం వస్తుండటంతో రైతులు కంగుతిన్నారు. ఇదిలా ఉండగా ఉప్పునీటితో ఆక్వా సాగు చేస్తున్న రైతులు వ్యర్థాలను పంట కాలువల్లోకి వదిలేస్తున్నారని, దీంతో తమ చేలల్లో పంటలు పాడవుతున్నాయని కొందరు రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణమని అంటున్నారు. కాలువ గట్టు ఆక్రమణలపై, వ్యర్థాలను పంట కాలువల్లో వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోకో రైతులకు న్యాయం చేయాలి
ఏపీ కోకో రైతుల సంఘం

ఏలూరు (టూటౌన్): కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలపై కోకో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు. ఏలూరులోని అన్నేభవనంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం ఈనెల 7 వరకు ఎదురు చూస్తామని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో జరిగిన సమావేశంలో కంపెనీల ప్రతినిధులు అబద్ధాలు వల్లించడం దుర్మార్గమన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజల ధర రూ.750 ఉండగా కంపెనీలు మాత్రం రూ.450 నుంచి రూ.550కే కొనుగోలు చేస్తున్నాయన్నారు. అన్ సీజన్ గింజలు కొనడం లేదన్నారు. దీంతో కౌలు రైతులు నష్టపోతున్నారన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలు కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లుపై ముస్లింల నిరసన




తణుకు నరేంద్ర సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు

తణుకు అర్బన్: వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా తణుకులో ముస్లింలు కదంతొక్కారు. శుక్రవారం పట్టణంలోని పెద్ద మసీదు నుంచి నరేంద్ర సెంటర్ వరకు ముస్లింలు ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. తణుకు నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అధిక సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ముస్లింల మతపరమైన హక్కులను కాలరాస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ముస్లింలపై చూపుతున్న మొండి వైఖరి నశించాలని, వక్ఫ్ అల్లా సొత్తు అని ముస్లింలు కేవలం పరిరక్షకులని, వక్ఫ్‌ను రాజకీయం చేయొద్దంటూ నినదించారు. ముస్లింలకు సీపీఎం కార్యదర్శి పీవీ ప్రతాప్, నాయకులు కామన మునిస్వామి మద్దతు తెలిపారు. జమాత్ ఏ ఇస్లామీ హింద్ నాయకులు, ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తప్పుడు కేసుపై డీఐజీకి ఫిర్యాదు
సాక్షి, టాస్క్‌ఫోర్స్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా దెందులూరు పోలీసులు తప్పుడు కేసు నమోదు చేయడంపై ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు ఆ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ వాట్సాప్‌లో ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. గత నెల 28న దెందులూరులోని సోమరాజు మిల్లు సమీపంలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనంపై వెళుతుండగా అదుపు తప్పి కింద పడ్డారు. వాహనం కొంత దూరం ఈడ్చుకెళ్లి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. 29న దెందులూరు పోలీసులు క్రైమ్ నం.69/2025తో కేసు నమోదు చేశారు. అయితే నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తిపై కాకుండా ఆటో, ఆటో డ్రైవర్‌పై కేసు పెట్టారు. ఆటో డ్రైవర్ తన తప్పు లేదని చెప్పడంతో ప్రమాదంతో సంబంధం లేని కింజరపు రవి అనే వ్యక్తిని ఆటో డ్రైవర్‌గా చూపించి కేసు నమోదు చేశారు. ఆటో ఢీ కొడితే మనిషి చనిపోయాడని శవ పంచనామా రిపోర్టు రాయించి రవితో స్టేషన్‌లో సంతకాలు పెట్టించి బెయిల్ ఇచ్చి పంపారు. సాక్షి సంతకానికి పిలిచి ఇలా చేయించారని సదరు బాధితుడు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన కాపీని, దెందులూరు కానిస్టేబుల్ మధు ఘటనకు సంబంధించి మరో ఫిర్యాదు కాపీని వాట్సాప్‌లో డీఐజీకి పంపారు. ఎస్సై శివాజీ, రైటర్ హమిత్ ఉద్దేశపూర్వకంగానే ఇదంతా చేశారని ఫిర్యాదులో పేర్కొని విచారణ చేయాలని కోరారు.

పన్ను వసూళ్లు డల్
- ఆస్తి పన్ను వసూళ్లు 55 శాతం లోపే..
- రూ.83 కోట్లకు రూ.45 కోట్లే వసూలు
- నూజివీడులో మాత్రమే 62 శాతం రాబడి
- ఫలితమివ్వని అధికారుల చర్యలు

మున్సిపాలిటీ	అసెస్‌మెంట్లు	వసూలు కావాల్సిన మొత్తం. (రూ.కోట్లలో)	వసూలైన మొత్తం (రూ.కోట్లలో)	శాతం
ఏలూరు (కార్పొరేషన్)	71,378	60.44	31.62	52.31
జంగారెడ్డిగూడెం	19,114	11.34	6.80	59.91
నూజివీడు	15,283	9.54	5.92	62.09
చింతలపూడి (నగర పంచాయతీ)	7,350	2.32	1.30	55.98



జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ వ్యూ

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లాలోని నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లు మందకొడిగా ఉన్నాయి. జిల్లాలో ఏలూరు నగరపాలక సంస్థ, జంగారెడ్డిగూడెం, నూజివీడు మున్సిపాలిటీలు, చింతలపూడి నగర పంచాయతీలు ఉన్నాయి. మొత్తంగా 54.56 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. ఒక్క నూజివీడు పట్టణంలో మాత్రమే 60 శాతానికి పైగా పన్ను ఆదాయం వచ్చింది.

లక్ష్యాన్ని చేరని వైనం

జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో గృహాలు, ఖాళీ స్థలాలు, వాణిజ్య, వ్యాపార సముదాయాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ద్వారా మార్చి 31 నాటికి నూరు శాతం పన్ను వసూలు చేస్తామని అధికారులు ప్రకటించినా లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేదు. మార్చి 31 నాటికి జిల్లాలో మొత్తంగా రూ.83.64 కోట్ల పన్నులు వసూలు కావాల్సి ఉండగా రూ.45.64 కోట్లు మాత్రమే వసూలైంది. మార్చి 31న అర్ధరాత్రి నుంచి ఆస్తిపన్నుకు సంబంధించి ప్రభుత్వ వెబ్‌సైట్ నిలిపివేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరం వివరాలు అప్‌డేట్ అయిన తర్వాత వెబ్‌సైట్ మళ్లీ అందుబాటులోకి రానుంది.

నూజివీడు ఫస్ట్.. ఏలూరు లాస్ట్

ఈ ఏడాది మార్చి 6 నాటికి పన్ను వసూళ్ల వేగవంతం చేస్తున్నామని అధికారులు చెప్పినా కార్యరూపం మాత్రం దాల్చలేదు. ఆ రోజున సగటున 43.38 శాతం పన్నులు వసూలు కాగా.. గడువు ముగిసే నాటికి 54.56 శాతం మాత్రమే వసూలయ్యాయి. నూజివీడు 62.09 శాతం ప్రథమ స్థానం, జంగారెడ్డిగూడెం 59.91 శాతంతో ద్వితీయ స్థానం, చింతలపూడి 55.98 శాతంతో మూడో స్థానంలో నిలిచాయి. ఏలూరు కార్పొరేషన్ మాత్రం 52.31 శాతంతో చివరి స్థానంలో ఉంది.

పటిష్ట చర్యలు తీసుకున్నాం



పన్ను వసూళ్లపై ప్రచార మాధ్యమాల ద్వారా, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ పంపించడం, ఫోన్ ద్వారా ఫాలో అప్ చేశాం. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి నెలలో తీసుకున్న చర్యల కారణంగా 12 శాతం అదనంగా వసూళ్లు చేయగలిగాం. మార్చి 31న ఆన్‌లైన్ వెబ్‌సైట్ నిలిపివేశారు. మరలా అప్‌డేట్ అయిన వివరాలతో ఈనెల 5 నుంచి వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే బకాయిలు ఉన్న వారికి నోటీసులు అందించడం, మౌఖికంగా సమాచారం ఇచ్చి సన్నద్ధం చేశాం. 5వ తేదీ తర్వాత గతేడాది పన్నులతో పాటు ఈ ఏడాది పన్నులు కూడా చెల్లించేలా యజమానులను చైతన్య పరుస్తున్నాం.

– కేవీ రమణ, కమిషనర్, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

పక్కాగా పది మూల్యాంకనం
కలెక్టర్ నాగరాణి

వీరవాసరం: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పక్కాగా పూర్తిచేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. వీరవాసరం ఎంఆర్‌కే జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మూల్యాంకన ప్రక్రియను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ జిల్లాలకు చెందిన 9 సబ్జెక్టులకు సంబంధించి 1,69,341 జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయన్నారు. 102 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 612 మంది సహాయ ఎగ్జామినర్స్, 204 మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తంగా 918 మంది డీఈఓ ఈ.నారాయణ పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మూల్యాంకనం ప్రక్రియ సుమారు వారం పాటు సాగుతుందని, లోటుపాట్లకు తావులేకుండా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

నీట్ పరీక్షలకు రెండు కేంద్రాలు

భీమవరం: జిల్లాలో మే 4న నిర్వహించే నీట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్ నుంచి పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 2,100 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని, తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ, శశి కాలేజీల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారన్నారు. పరీక్షలు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని, కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డీఈఓ ఈ.నారాయణ, పరీక్షల నిర్వహణ జిల్లా నోడల్ అధికారి ఎస్.జయరాం, ఎన్ఐటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ ఎస్.సునీల్ కుమార్, తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ పాల్గొన్నారు.



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

క్లుప్తంగా

5, 6న భగవద్గీత పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న విశ్వనాథరాజు, వెంకట్రాజు, చంద్రాజి

భీమవరం: ఈ నెల 5,6 తేదీల్లో ఆనంద గీతా యజ్ఞం రాష్ట్ర స్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలను ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు తెలిపారు. ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల పోటీలను 4 విభాగాల్లో నిర్వహిస్తున్నామని, మొత్తం 108 శ్లోకాలపై పోటీలు జరుగుతాయన్నారు. సుమారు 1000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఏ విభాగమైన ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతాయని చెప్పారు. ప్రతి విభాగంలోని ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ రూ.2 వేలు అందిస్తారని చెప్పారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి

టి.నరసాపురం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి గుండెపోటు రావడంతో మృతి చెందాడు. రాజపోతేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని కె.జగ్గవరానికి చెందిన కొక్కుల సోమేశ్వరరావు(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం భార్యను వెంటబెట్టుకొని జగ్గవరం నుంచి ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో హాస్పటల్‌కు బయల్దేరాడు. మధ్యలో రాజుపోతేపల్లి సెంటర్ వద్దకు వచ్చిన తర్వాత ఒక్కసారిగా గుండెపోటు రావడంతో బస్సులో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆటో బోల్తా.. 10 మందికి గాయాలు



చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

చింతలపూడి: కూలీలతో వస్తున్న ట్రక్ ఆటో బోల్తా పడ్డ సంఘటన చింతలపూడి మండలం, ఆంథోనీ నగర్ సమీపంలో శుక్రవారం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా దుద్దుపూడి గ్రామానికి చెందిన కూలీలు చింతలపూడి మండలం వెలగలపల్లిలో మొక్కజొన్న ఫ్యాక్టరీలో గురువారం రాత్రి పనికి వెళ్లి ట్రక్ ఆటోలో తిరిగి వస్తుండగా ఆటో పంక్చర్ కావడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కనపర్తి లక్ష్మికి తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

చేదెక్కుతున్న మామిడి

దిగుబడి తగ్గడంతో రైతుల్లో ఆందోళన

నూజివీడు: పండ్లలో రారాజు మామిడి.. అయితే మామిడికి గడ్డు పరిస్థితులు దాపురించాయి. ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. గత నాలుగేళ్లుగా మామిడి దిగుబడి దారుణంగా పడిపోతుండటంతో మామిడి రైతుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక.. గొయ్యి అన్న చందంగా తయారైంది. మామిడి పంట సంక్షోభం దిశగా పయనిస్తోంది. రైతులు పూత నిలుపుకునేందుకు ఎకరాకు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టినా ప్రకృతి సహకరించక.. తెగుళ్లు, పురుగుల బెడదతో పూతలు మాడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

41వేల ఎకరాల్లో మామిడి తోటలు

జిల్లాలోని నూజివీడు, చింతలపూడి నియోజకవర్గాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో అధికంగా నూజివీడు నియోజకవర్గంలో మామిడి తోటలు సాగవుతుండగా మొత్తం మీద 41 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. వీటిల్లో ఎక్కువగా బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలు, పెద్దరసాలు వంటి రకాలున్నాయి. వరి, మొక్కజొన్న, పామాయిల్ వంటి పంటలతో పాటు మామిడి కూడా ప్రధానంగా రైతులు సాగు చేస్తున్నారు. దీంతో రైతులు మామిడిపై ఎన్నో ఆశలు పెట్టుకొని ముందుకు సాగుతుండగా కాలం కలిసి రాకపోవడంతో రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి.



నిలవని పూత

ఈ ఏడాది మామిడి తోటల్లో పూతలు బాగా వచ్చినప్పటికీ ఏ మాత్రం నిలబడలేదు. రెండు విడతలుగా పూత రాగా ముందు విడత పూత డిసెంబరు 15 నుంచి జనవరి మొదటి వారం వరకు వచ్చింది. రెండో విడత పూత జనవరి 20 తరువాత నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు వచ్చింది. మొత్తం విస్తీర్ణంలో దాదాపు 95 శాతం తోటలు పూత పూసినప్పటికీ పూత నిలవలేదు. నల్లతామర పురుగు ఆశించడంతో వచ్చిన పూతంతా తుడిచిపెట్టుకుపోయి కేవలం పూత కాడలే మిగిలాయి. దీంతో మామిడి పూత మొత్తం విస్తీర్ణంలో 20 శాతం కూడా లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పూతను



నల్లతామరతో మాడిపోయిన పూత

నిలుపుకునేందుకు రైతులు మామిడి తోటలకు 12 నుంచి 15 సార్లు పురుగుమందులు పిచికారీ చేశారు. అయినప్పటికీ నల్లతామర దాటికి పూతంతా మాడిమసైపోవడంతో రైతులు నష్టాల పాలై నిండా మునిగిపోయారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టినా దిగుబడి లేకపోవడంతో రైతులు అప్పుల్లో పీకల్లోతు కూరుకుపోయారు.

మండలం	మామిడి విస్తీర్ణం ఎకరాలు	దిగుబడి (అంచనా) టన్నుల్లో
నూజివీడు	10,434	41,736
ఆగిరిపల్లి	17,655	71,060
ముసునూరు	2,520	8,500
చాట్రాయి	3,619	14,476
చింతలపూడి	4,000	15,315
లింగపాలెం	3,000	11,500
మొత్తం	41,208	1,62,587

పూత నిలవలేదు



పదెకరాల మామిడి తోటకు ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టి పురుగుమందులు కొట్టినా పురుగు చావలేదు. మామిడి రైతు పరిస్థితి దారుణంగా ఉంది. ఎన్నిసార్లు పిచికారీ చేసినా పురుగులు చావడం లేదు. వేలాది రూపాయలతో కొనుగోలు చేసి కొట్టినా పురుగు మందులు పనిచేయడం లేదు. నకిలీ పురుగు మందులు వస్తున్నాయనే అనుమానం ఉంది.

– బాణావతు రాజు, లైన్‌తండా, నూజివీడు

ధర అంతంత మాత్రమే

దిగుబడి లేనప్పటికీ మామిడికి ధర అంతంత మాత్రంగానే ఉందని రైతులు వాపోతున్నారు. కాయలు బాగుంటే బంగినపల్లి టన్నుకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు, తోతాపురి టన్నుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల ధర మాత్రమే పలుకుతున్నాయని, కాయలపై మచ్చలు ఉంటే ఆ మాత్రం ధర కూడా రావడం లేదని పేర్కొంటున్నారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

కామవరపుకోట: కడుపు నొప్పి తాళలేక మహిళ ఉరేసుకుని మృతి చెందిన ఘటన మండలంలో ఉప్పలపాడులో జరిగింది. తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలపాడుకు చెందిన కాల్నిడి గంగాభవానికి (32) టి.నరసాపురం మండలం తిరుమల దేవిపేటకు చెందిన మేనమామ కాల్నిడి ధనలక్ష్మీనారాయణతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. గంగాభవాని కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుంది. బుధవారం ఉదయం పిల్లలతో సహా ఉప్పలపాడు గ్రామం పుట్టింటికి వచ్చింది. గురువారం ఉదయం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అంజలి మృతిపై విచారణ జరిపించాలి

ఏలూరు (టూటౌన్): రాజమండ్రి బొలినేని ఆసుపత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న నల్లపు అంజలి మృతికి కారణమైన వారికి కఠినంగా శిక్షించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. నిందితుడి పట్ల సానుకూలంగా వ్యవహరించే ప్రమాదం ఉందని ప్రజలు అనుమానిస్తున్నారని ఆ అనుమానాలు నివృత్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంజలి జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి చెందిన నల్లపు దుర్గారావు కుమార్తెని ఆయన తెలిపారు.

అభినవ దానకర్ణుడు అనంత కోటిరాజు

గణపవరం: ఎంత సంపాదించినా లభించని తృప్తి, ఇతరులకు సాయం పడటం, సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం ద్వారా లభిస్తుందని కేంద్ర ఉక్కు, గనుల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శుక్రవారం గణపవరంలో రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.36 కోట్ల సాయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షత వహించారు. శ్రీనివాసవర్మ మాట్లాడుతూ సేవ చేయడానికి, ఇతరులకు సహాయపడటానికి కూడా ఒక హద్దు ఉంటుందని, వేగేశ్న అనంత కోటిరాజుకు ఈ హద్దులేమీ లేవని, ఇప్పటివరకూ తన సేవా సంస్థ ద్వారా సుమారు రూ.300 కోట్ల సేవా కార్యక్రమాలను పూర్తిచేయడం ఆయనలోని మానవత్వానికి, గొప్పదనానికి నిదర్శనమన్నారు. అనంత కోటిరాజు అభినవ దానకర్ణుడని అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, స్థానిక నాయకులు కాకర్ల శ్రీను, కె.జగపతిరాజు, దండు రాము,



మైక్రోఫిల్టర్స్ ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే వాసుబాబు తదితరులు

నడింపల్లి సోమరాజు, కొనెటి రమేష్, ఇందుకూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. గణపవరంలో వేగేశ్న ఫౌండేషన్ రూ.35 కోట్లతో నిర్మించిన ఎనిమిదెకరాల మంచినీటి చెరువు, జగన్నాథపురంలో మంచినీటి చెరువు అభివృద్ధి, చెరువు చుట్టూ ప్రహరీ, మైక్రోఫిల్టర్స్, జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలో రూ.15 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతకోటిరాజు దంపతులను పంచాయతీ తరపున సన్మానించారు. అనంతకోటిరాజు మాట్లాడుతూ రాజు వేగేశ్న ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొన సాగుతాయని ప్రకటించారు.

వేసవిలో పిల్లల ఆరోగ్యం జాగ్రత్త!

పాలకొల్లు సెంట్రల్: వేసవిలో చిన్నారులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవి ప్రారంభమైందంటే చాలు చికెన్ పాక్స్(ఆటలమ్మ), గవద బిళ్లలు వంటివి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని.. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వీటి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు పాలకొల్లు మండలం లంకలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు అడ్డాల ప్రతాప్ కుమార్.

చికెన్ పాక్స్ అన్ని వయసుల వారికి సోకినా.. ముఖ్యంగా చిన్నారులకు వేగంగా సోకే ప్రమాదం ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నప్పుడు ఇవి ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇవి సోకిన వారు ఆహారం సరిగా తీసుకోలేకపోవడం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలతో నీరసంగా కనిపిస్తుంటారు. ఆటలమ్మ, గవద బిళ్లల లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచనల మేరకు యాంటీ వైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

గవద బిళ్లలు

చల్లటి పానీయాలు అతిగా తీసుకోవడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి తగ్గి గవద బిళ్లలు వస్తాయి. ప్రధానంగా లాలాజల గ్రంధులు ఉబ్బ



డంతో గవద బిళ్లలు ఏర్పడతాయి. గోరు వెచ్చని నీళ్లు తాగాలి. ఏ ఆహారం తిన్నా నోటిలో నీళ్లు వేసుకుని పుక్కిలించాలి. ఎంఎంఆర్ టీకా వేయించుకోవడం వల్ల గవద బిళ్లలు రాకుండా నివారించవచ్చు. గవద బిళ్లలకు మందులు వాడితే మూడు రోజుల్లో తగ్గుతుంది. వాపు ఎక్కువగా ఉంటే తగ్గడానికి ఏడు రోజులు పడుతుంది.

చికెన్ పాక్స్

ఆటలమ్మ వైరస్ వల్ల వస్తుంది. జ్వరం.. శరీరంలో వేడి ఎక్కువై పొక్కులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో స్కిన్ ఎలర్జీని కూడా ఆటలమ్మ అనుకుంటారు. ఆటలమ్మ అరి చేతులు, పాదాలు, నెత్తి మీద రాదు. అలా వచ్చాయంటే అవి స్కిన్ ఎలర్జీగా గుర్తించాలి. ఆటలమ్మ సోకిన వాళ్లు ద్రవ పదార్థాలు తీసుకోవాలి. ప్రతి రోజూ శుభ్రంగా స్నానం చేయాలి. టీకా అందుబాటులో ఉంది. వేయించుకోవడం మంచిది. చికెన్ పాక్స్ వచ్చిన వారికి దురద ఎక్కువగా ఉంటుంది. ఒక చోట గోకి మరో చోటు గోకితే అక్కడ పొక్కులు వస్తాయి. అందువల్ల గోర్లు పెరగకుండా చూసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకిన వారిని ఇంట్లో మిగిలిన సభ్యులకు దూరంగా ఉంచాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని మాత్రమే అందించాలి. గవద బిళ్లలు వచ్చిన వారికి గొంతు నొప్పి ఎక్కువగా ఉంటుంది. నోటిని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. ఎక్కువగా ద్రవ పదార్థాలు ఉండేలా శ్రద్ధ తీసుకోవాలి. మూఢ నమ్మకాలు, అపోహలకు పోకుండా వైద్య సహాయం తీసుకోవాలి. ఈ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. వైద్యులు చెబుతున్నారు. వ్యాధులు సోకకుండా ఉండాలంటే వేడి నీళ్లు తాగడంతో పాటు.. శుభ్రమైన ఆహారం తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.



డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, లంకలకోడేరు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముసునూరు: పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన పింగుల ఏసుబాబు(48) ఏడాదికాలంగా మండలంలోని గుళ్ళపూడి శివారు గుడిపాడుకు చెందిన నెక్కరగంటి సత్యనారాయణ వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నాడు. గురువారం తోటలో గడ్డి కోసుకు రావడానికి వెళ్ళాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. శుక్రవారం పామాయిల్ తోటలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్సై సిబ్బందితో ఘటనా స్థలానికి



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఏసుబాబు

చేరుకుని విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో పోస్టు మార్టం నిమిత్తం తరలించినట్లు చెప్పారు. మృతుడి కుమారుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పోలవరానికి చంద్రగ్రహణం తప్పదేమో?

వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎల్.నర్సింహరాజు



ఆకివీడు: పోలవరం ప్రాజెక్టుకు చంద్రగ్రహణం తప్పదేమోనని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్మాణం మరో ఐదేళ్లకు కూడా పూర్తికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఆనాడు భూమి పూజ చేయకపోతే అసలు పోలవరం ప్రాజెక్టునే ప్రజలు చూసేవారు కాదన్నారు. చంద్రబాబే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని పీవీఎల్ ఆరోపించారు. లక్షలాది ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టు గత పాలనలో చంద్రబాబుకు గుర్తుకురాలేదా? అని ధ్వజమెత్తారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో లోయర్, అప్పర్ కాపర్ డ్యాంలు, బ్యారేజీకి చెందిన 48 గేట్లు పూర్తి చేయించారన్నారు. పోలవరానికి పునాదులు వేసి, నిర్మాణ పనుల్ని వేగంగా పరిగెత్తించిన రాజశేఖరరెడ్డి, జగన్ మోహన్ రెడ్డిలే పోలవరం జాప్యానికి కారణమని చెప్పడం విడ్డూరంగా ఉందని పీవీఎల్ ధ్వజమెత్తారు. పోలవరాన్ని ఎరగా చూపి మళ్లీ వచ్చే ఎన్నికల ప్రచారంలో వినియోగించుకునేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయకపోతే చంద్రబాబు చరిత్ర హీనుడుగా మిగులుతారన్నారు.

ట్రిపుల్ ఐటీలో పవర్ విజన్‌పై శిక్షణ



ట్రిపుల్‌ఈ విద్యార్థులతో పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ కే నాగమోహన్‌రావు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలోని ట్రిపుల్‌ఈ ఇంజినీరింగ్ విద్యార్థులకు శుక్రవారం పవర్ విజన్ 2050, ఎనర్జీ ఇంజినీరింగ్‌పై కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విజయవాడ సమీపంలోని ఉన్న పవర్‌గ్రిడ్ జనరల్ మేనేజర్ కే నాగమోహన్‌రావు భారతదేశంలోని విద్యుత్ రంగం–భవిష్యత్ అనే అంశంపై ప్రసంగించారు. 2050 నాటికి దేశంలోని విద్యుత్ శక్తి రంగం స్థిరమైన, సమర్థవంతమైన, వినియోగదారులకు అనుకూలమైన రంగంగా మారుతుందన్నారు. స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతల గురించి వివరించారు. ట్రిపుల్‌ఈ హెచ్‌ఓడీ శ్రావణి కనక కుమారి, కోఆర్డినేటర్ జ్యోతీలాల్ నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

గండేపల్లి: ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై యువీ శివనాగబాబు తెలిపారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన బాడవుల కేదార్ మణికంఠ (21) రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం స్నేహితుడు విష్ణువర్ధన్‌తో కలిసి ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో బిర్యాని తినేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గండేపల్లి శివారుకు వచ్చేసరికి బైక్‌పై రాంగ్‌రూట్‌లో వచ్చిన వ్యక్తి వీరి బైక్‌ను ఢీకొట్టడంతో కేదార్ మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. రాజానగరం జీఎస్ఎల్‌కు తరలించగా అప్పటికే మణికంఠ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.



మృతుడు మణికంఠ (ఫైల్)

గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం



చల్లా బసవయ్య మృతదేహం

జంగారెడ్డిగూడెం : గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు లక్కవరం ఎస్సై శశాంక తెలిపారు. గురువారం మండలంలోని లక్కవరం–నాగులగూడెం గ్రామాల మధ్య కొండ దేవతల ఆలయం పాత ఇసుక ర్యాంపు సమీపంలోని ఎర్రకాలువలో లక్కవరానికి చెందిన చల్లా బసవయ్య(70) గల్లంతయ్యాడు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న బసవయ్య గురువారం పశువులు మేపేందుకు బసవయ్య కాలువ సమీపంలోకి వెళ్లాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, కాలువ వద్ద అతడి చెప్పులు, తువ్వాలు, కర్ర ఉన్నాయి. ప్రమాదవశాత్తూ మునిగిపోయి ఉంటారని స్థానికులు భావించారు. సమాచారం అందుకున్న లక్కవరం ఎస్సై శశాంక ఘటనాస్థలికి చేరుకుని వృద్ధుడి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు గాలించినప్పటికీ బసవయ్య మృతదేహం లభ్యం కాకపోవడంతో, శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా బసవయ్య మృతదేహం నీటిలో తేలుతూ ఉండడంతో గుర్తించి స్థానికుల సహకారంతో బయటికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



టి.నరసాపురం: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టి.నరసాపురం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తమకు అందిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి మండలంలోని మల్లుకుంట సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని కాకినాడ తరలిస్తుండగా గుర్తించి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోడి వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ సీజ్

భీమడోలు : భీమడోలు పంచాయతీ శివారు పెదలింగంపాడు ఆక్వా చెరువులకు కోడి వ్యర్థాలు తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. పెదపాడుకు చెందిన కోరం ప్రకాష్, కూడిపూడి వాసు వ్యాన్‌లో హైదరాబాద్ నుంచి లింగంపాడులోని గంటా మోహనరావు ఆక్వా చెర్వులకు కోడి వ్యర్థాలు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న భీమడోలు ఎస్సై వై.సుధాకర్ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

చిరు వ్యాపారులకు పన్ను పోటు

- సంపద సృష్టిస్తున్న కూటమి
- మునిసిపల్ గెజిట్ నిబంధనలకు తూట్లు
- చిరు వ్యాపారులకు షాకిస్తున్న పన్ను రశీదులు
- రెట్టింపు వసూళ్లతో గగ్గోలు
- అధికారులు పట్టించుకోవాలంటున్న వైనం

తణుకు అర్బన్: రహదారులను అనుకుని పొట్టనింపుకునే చిరు వ్యాపారులకు తాజాగా మునిసిపాలిటీ పన్ను (ఆశీలు) షాకిస్తుంది. పన్ను రెట్టింపు కావడంతో వ్యాపారం జరిగేదే అంతంతమాత్రమైతే ఇక మునిసిపాలిటీకి పన్ను ఎలా చెల్లించాలి దేవుడా అంటూ చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. రెండురోజులుగా గతం కంటే పన్ను రెట్టింపు చేసి కట్టించుకుంటున్న వైనంతో వ్యాపారులు సంపాదించిన సొమ్ము మునిసిపాలిటీకే చెల్లిస్తే మేము ఏం తినాలంటూ ఆకాశంవైపు చూస్తున్నారు. ఇప్పటికే మునిసిపల్ గెజిట్‌కు విరుద్ధంగా పాటదారుల తరపున గుమస్తాలు వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలో రూ. 10లు చెల్లించేవారికి ఇప్పుడు రూ. 20లు, రూ. 20 చెల్లించేవారికి రూ. 40 నుంచి రూ. 50లు వసూళ్లకు దిగుతున్నారు. దీంతో ఇదెక్కడి దారుణం అంటూ చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై వివిధ వ్యాపారాలు చేసుకునే వారికి రూ. 15 నుంచి రూ. 20లోపు వసూలు చేయాల్సి ఉండగా రూ. 40లు వసూలు చేస్తున్నారు. ఇలా గెజిట్‌లో ఉన్న పన్ను చెల్లింపులకు వ్యతిరేకంగా అందినకాడికి దోచుకుంటున్నా మునిసిపల్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని చిరు వ్యాపారులు వాపోతున్నారు. సంఘాల పరిధిలో ఉన్న తోపుడు బండ్ల వారిలో గతంలో రూ. 10 చెల్లించే వారికి నేడు రూ. 2 నుంచి రూ.5లు పెంచి వసూలు చేస్తున్నారు. ఏ సంఘంలో లేని చిరు వ్యాపారుల నుంచి బెదిరించి తమ ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.



తణుకు రాష్ట్రపతి రోడ్డులో ద్విచక్రవాహనంపై జీడిమామిడి కాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారి

ఈ ఏడాది పన్నుపాట
అన్ని ఖర్చులతో కలిపి రూ. 58,39,488.

రహదారుల్లోని మార్జిన్‌లు, డ్రెయినేజీలపై చిన్నపాటి దుకాణాలు, తోపుడు బండ్లు, స్టాల్స్ ద్వారా చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటే జీవనం సాగించే వారు పట్టణ ప్రాంతాల్లో అయితే మునిసిపాలిటీకి, గ్రామాల్లో అయితే పంచాయతీలకు ప్రతిరోజూ గెజిట్ ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే గతనెల 25వ తేదీన తణుకు మునిసిపాలిటీలో నిర్వహించిన పన్ను పాటలో పాటదారులు పోటాపోటీగా పాట పాడారు. రూ. 30 లక్షలతో మునిసిపల్ అధికారులు మొదలుపెట్టిన పాట ఈ ఏడాది ఏకంగా రూ. 45 లక్షలకు పైగా ఎగబాకింది. దీనికితోడు స్లీపింగ్ చార్జీలు, జీఎస్టీ జతచేసుకుని మొత్తం ఈ 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 58,39,488 మునిసిపాలిటీలకు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 25 లక్షలకు పాడిన పన్నుపాట రెట్టింపుగా పెరగడం మునిసిపాలిటీకి ఆదాయపరంగా సానుకూలాంశమే అయినప్పటికీ, ఆ బరువు చిరు వ్యాపారులపై పడి వారి ఆర్థిక స్థితి దిగజారిపోతుండడం బాధాకరమని పలువురు వాపోతున్నారు. పాట పెరిగిందని మునిసిపల్ గెజిట్‌లో ఉన్న పన్ను చెల్లింపుల కన్నా అధికంగా వసూళ్లకు పాల్పడుతుండడం గమనార్హం.



తణుకులో చిరు వ్యాపారి నుంచి రూ. 40ల పన్ను కట్టించుకున్న రశీదు

చిరు వ్యాపారుల నుంచి సంపద సృష్టి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంపద సృష్టిపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే న్యూసెన్స్ కేసులు, ఆ కేసులు, ఈ కేసులు అంటూ పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని ఇప్పుడు కొత్తగా పన్ను పెంచి మానుంచి సంపద సృష్టించుకుంటున్నారని విమర్శిస్తున్నారు. గతంలో ఇలా చిరు వ్యాపారులను ఎప్పుడూ ఇబ్బందులకు గురిచేయలేదని, ఐదేళ్లపాటు ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకున్నామని, రెండు పర్యాయాలు అసలు పన్ను లేకుండానే మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చిరు వ్యాపారులకు అండగా నిలిచారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి రహదారుల్లో వ్యాపారాలు చేయనివ్వరని భయపడుతూ దిన దిన గండంగా బతుకుతున్నామని, ఈ 10 నెలల్లో మునిసిపల్, పోలీసు అధికారులతో ఇబ్బందులు వస్తున్నా కాళ్లు పట్టుకుని వేడుకుని వ్యాపారాలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తణుకు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను సాక్షి వివరణ కోరగా మునిసిపల్ గెజిట్‌ను అనుసరించే రహదారులపై వ్యాపారాలు చేసుకునే వారి నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉందని, పాటదారులు నిబంధనలు మీరి అధికధరలు వసూలు చేస్తే శాఖాపరంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మానవత సేవలు అభినందనీయం



తణుకు ఎస్ఎన్‌వీటీ కళాశాలలో విద్యార్థినికి గ్లాసులు అందజేస్తున్న మానవత సభ్యులు

తణుకు అర్బన్: దాతల సహకారంతో మానవత సేవా సంస్థ సేవలు విస్తరిస్తున్నామని సంస్థ అధ్యక్షురాలు కటారి శారదాదేవి అన్నారు. స్థానిక ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం పట్టణానికి చెందిన చిట్టూరి సుజాత సౌజన్యంతో 200 స్టీలు గ్లాసులు, అధ్యక్షురాలు కటారి శారదా దేవి, ఇతర దాతల సహకారంతో 50 భోజనం ప్లేట్లను మానవత సభ్యులు శుక్రవారం కళాశాలలో అందజేశారు. ఈ సందర్భంగా శారదాదేవి మాట్లాడుతూ దాతల సహకారంతో ఈ కళాశాలకు ఇప్పటికే 2 కంప్యూటర్లు, మధ్యాహ్న భోజనానికి అవసరమైన వంట సామగ్రిని, ఒక మైకు అందజేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.తులసి లక్ష్మి తణుకు మానవత సంస్థకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మానవత సంస్థ విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, తణుకు మానవత సంస్థ కార్యదర్శి బొల్లం రామ కాశి, కోశాధికారి అక్కిన కాశీ విశ్వనాథం, పూర్వపు అధ్యక్షులు ఆలపాటి సుబ్బారావు, సభ్యులు మురళీ హరినాథ్, ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, సత్తిరాజు, డాక్టర్ కె.రామలక్ష్మి, అక్కిన లక్ష్మి, మణిదీప్ జయ ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దండగర్ర విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి ఎక్స్‌పోలో తృతీయ స్థానం సాధించిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా భీమవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎక్స్ పోలో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్లు స్కూలు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ప్రొటీన్ పోషకాహారం ప్రదర్శనకు గాను తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీరమళ్ల పద్మశ్రీ, యెగ్గిన పూర్వజలక్ష్మి, మైనం ప్రదీప్తి, సంకు అమ్ములు ఈ అవార్డును గెలుచుకున్నారన్నారు. ఈసందర్భంగా వారిని హెచ్ఎం చంద్రశేఖర్, గైడ్ టీచర్ కే.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులు నవధాన్యాలపై ఆసక్తిని పెంచుకోవాలి



ఆకుతీగపాడులో రైతులతో మాట్లాడుతున్న డీపీఎం నూకరాజు, తదితరులు

పెంటపాడు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ కనపరుస్తూ నవధాన్యాలపై ఆసక్తిని పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ వై. నూకరాజు పేర్కొన్నారు. పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామంలో శుక్రవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సామూహికంగా బ్లాక్ రైసుతో పాటు, నవధాన్యాలు వేసుకోవాలన్నారు. జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, ఎం.సుబ్బారావు, మండల ఇన్‌చార్జి వీర్రాజు, సీఆర్పీ నాగేశ్వరరావు, నీటిసంఘ నాయకులు ఎం. సూర్యచంద్రరావు,లవన్న, వీరన్న, శ్రీను, నాగేశ్వరరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నూతన కమిటీ ఎన్నిక



కాకొల్లు విజయ, అధ్యక్షుడు



ప్రతాప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి

తణుకు అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ న్యాయవాదుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాకొల్లు విజయ, ప్రధాన కార్యదర్శిగా ముమ్మిడివరపు ప్రతాప్‌కుమార్, సహాయ కార్యదర్శిగా రాపాక ప్రభాకర్, కోశాధికారిగా ఏలూరి చిట్టి మోషేషులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విజయ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి కృషి చేస్తానని, సభ్యుల సహకారాన్ని తీసుకుని అసోసియేషన్‌ను బలోపేతం చేస్తానని చెప్పారు.

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలి

తణుకు అర్బన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను పరిరక్షించాలని అక్కడి జీవ వైవిధ్యాన్ని కాపాడాలని, యూనివర్శిటీ విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.1974లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి 2300 ఎకరాల భూమిని కేటాయించారని పలు విభాగాలకు ఈ భూమిని కేటాయింపులు చేయగా ఇంకా 1800 ఎకరాల భూమి మిగులు ఉందని అన్నారు. ప్రభుత్వ అవసరాల కోసం విశ్వవిద్యాలయాల్లో భూములను తీసుకుంటూ పోతే వేలాది మందిని ప్రయోజకులను చేసే విశ్వవిద్యాలయాలకు ఏ విధంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఈ ధర్నాలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తణుకు నియోజక వర్గ అధ్యక్షుడు ఎడ్వర్డ్ పాల్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు యు.జశ్వంత్, టి అభి. పి.సత్యకృష్ణ, కే. సూర్య, జే.దీపక్, బి.సాయి, పి.దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని సద్వినియోగం చేసుకోండి

పెంటపాడు: ప్రభుత్వ బడిని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని, బడిఈడు పిల్లలను తప్పక ప్రభుత్వ బడిలో చేర్పించాలని దర్శిపర్రు గ్రామ సర్పంచ్ కోలా శేషవేణి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మండల విద్యాశాఖ అధికారి టీవీ రామకృష్ణ, హెచ్ఎం నారాయణ తదితరులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేసారు. ప్రేవేటు పాఠశాలలను విడనాడి అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ బడిని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకొని నూతన విద్యాసంవత్సరంలో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆమె కోరారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

తణుకు అర్బన్: కేంద్ర ప్రభుత్వానికి భారత రాజ్యాంగంపై కనీస విశ్వాసం ఉంటే వక్ఫ్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం గ్రామ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు, పార్టీ సీనియర్ నాయకులు అంబటి రామకృష్ణ డిమాండ్ చేశారు. లౌకిక విలువలను, మైనార్టీల హక్కులను హరిస్తూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేల్పూరు మసీదు వద్ద ముస్లింలను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌకికవాదం, సమానత్వం, ప్రజాస్వామ్యం వంటి రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం రాజ్యాంగ సూత్రాలను అవమానించడమే అన్నారు. ముస్లింలు వ్యతిరేకిస్తున్న ఈ చట్టానికి తెలుగుదేశం, జనసేన కూటమి ఒకవైపు మద్దతు ఇస్తూనే రంజాన్ సందర్భంగా జరిగిన ఇఫ్తార్ విందుల్లో పాల్గొని మైనారీల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు కుడక వీరభద్రరావు, ముస్లిం మత పెద్దలు షేక్ సత్తార్. భాష. లాల్ సాహెబ్. మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్: వేల్పూరులో ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వక్ఫ్ చట్ట సవరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వక్ఫ్ చట్ట సవరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా సభ్యులు చింతకాయల బాబురావు విజ్ఞప్తి చేశారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌లో అమోదించిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను సీపీఎం వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ చర్య దేశ లౌకిక వాదానికి విఘాతమని, దేశాన్ని మత రాజ్యాంగ మార్చే చర్యలుగా అభివర్ణించారు. ఈ చర్యలను అడ్డుకోవాలని లౌకిక వాదులను కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని అన్ని మతాలకు రాజ్యాంగం కల్పించిన సదుపాయాలను దెబ్బతీస్తుందన్నారు. దేశంలో మైనార్టీలపై మతదాడులు సాగించేందుకు ప్రోత్సహిస్తుందని విమర్శించారు. సీపీఎం నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, పెనగంటి దుర్గారావు, పోతు శ్రీను, దత్తు రాము పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ): సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

స్కౌట్స్ శిక్షణతో జీవన నైపుణ్యాలు

తాడేపల్లిగూడెం రూరల్: స్కౌట్స్ శిక్షణ పూర్తయ్యేనాటికి విద్యార్థులు వృత్తి, విద్యా, జీవన నైపుణ్యాలను అలవడతాయని ప్రిన్సిపల్ బి.రాజారావు అన్నారు. పీఎంశ్రీ స్కూల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్కౌట్ ప్రవేశ పరీక్ష క్యాంపు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజారావు మాట్లాడుతూ దేశ సేవ, క్రమశిక్షణ, ప్రథమ చికిత్స, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, శారీరక దారుఢ్యం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు తదితర అంశాలపై శిక్షణనిస్తారన్నారు. 450మంది విద్యార్థులు 18 స్కౌట్ యూనిట్స్‌గా ఏర్పడి శిక్షణ పొందనున్నట్లు వివరించారు. క్యాంపునకు బ్రహ్మేశ్వరరావు స్కౌట్ శిక్షకులుగా వ్యవహరిస్తారన్నారు. జిల్లా స్కౌట్స్, గైడ్స్ సెక్రటరీ ఉంగరాల నాగేశ్వరరావు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పర్యవేక్షకులు సిరిమువ్వ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎంవి.బాలాజీ, ఎస్.ఆనంద్, ఎం.నవీన్, డి.కృష్ణ, స్కౌట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెదతాడేపల్లి గురుకులం వద్ద అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలి

తణుకు అర్బన్: ఎన్నికల ముందు ప్రస్తుత కూటమి నేతలు హామీ ఇచ్చిన ప్రకారం పేదలకు పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ పార్టీ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో సుమారు 350 మంది ఇళ్ల స్థలాల కొరకు అర్జీలు పూర్తిచేసి తహసీలాద్దార్ అశోక్ వర్మకు అందజేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పేదలు సొంతిళ్లు లేక అద్దె ఇళ్లకు వేలాది రూపాయిలు బాడుగలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామన్న అన్ని సంక్షేమ పథకాలు కన్నా ముఖ్యంగా ఇల్ల స్థలాలు ఇస్తామన్న హామీ తక్షణమే అమలు చేయాలని అన్నారు. తక్షణమే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని, గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు రుణం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తణుకు పట్టణ నాయకులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

దోమ కాటుతో ముప్పే

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో కీటక జనిత వ్యాధులను అరికడదామని సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రాలు కడకట్ల, బీబీ సెంటర్ పరిధిలో 9, 10, 12, 33, 34, 35 వార్డులలో హెల్త్ సిబ్బందిచే శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలనలు, దోమ లార్వాను ఏ విధంగా కనుగొనాలి, గృహ సందర్శనాలు, ర్యాలీలు నిర్వహించారు. దోమల నివారణకు ప్రజలను తప్పక భాగస్వామ్యం చేయాలన్నారు. గృహాలు వద్ద, పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలను అరికడితే తప్పక మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, పైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులను నియంత్రణ చేయవచ్చునని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, రాజేశ్వరీ, కృపమ్మ, మేరీ, మంగతాయారు, ఆశాలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధి పెదతాడేపల్లి గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దోమ లార్వాలను గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలను నియంత్రించడం ద్వారా వ్యాధులు దరి చేరవన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది నవ్య ప్రవల్లిక, ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, రాజేశ్వరి, కృపమ్మ, మేరీ, వెంకటలక్ష్మి, పద్మ, సరోజిని, మంగతాయారు, ఆశాలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పెదతాడేపల్లి గ్రామంలో ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): చెత్త సేకరణలో తీసుకోవాల్సిన చర్యలు గురించి పారిశుద్ధ్య అధికారులకు, సిబ్బందికి శుక్రవారం స్థానిక పాతూరు వెహికల్ షెడ్డులో అవగాహన కార్యక్రమం కమిషనర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ చెత్త సేకరణ విషయంలో పారిశుద్ధ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరణలో ప్రజలు చాలా చోట్ల తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం లేదని తెలిపారు. వారిలో చైతన్యం తప్పక తీసుకురావాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో హ్యాండ్ మైక్‌లు ద్వారా విస్తృత ప్రచారంతో పాటు ప్రజలకు ఇంటింటి వద్ద అవగాహన చేసేందుకు ప్లాస్టిక్ షీట్స్‌ను ఇంటి ముందు పరిచి, తడి చెత్త, పొడి చెత్తను చూపిస్తు ఏవిధంగా వేరు చేయాలో ప్రజలకు ప్రయాగాత్మకంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఎస్.రాజు, శానిటరీ ఇనస్పెక్టర్లు శ్రీమన్నారాయణ, సోమేశ్వరరావు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి సోపానం ముఖాముఖీలు

అత్తిలి: స్వయం ఉపాధి సోపానం పథకంలో బ్యాంకు లింకేజి ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అత్తిలి, కె సముద్రపుగట్టు, ఉరదాళ్లపాలెం, ఆరవల్లి, దంతుపల్లి, ఉనికిలి, లక్ష్మీనారాయణపురం గ్రామాలకు చెందిన అభ్యర్థులకు సంబంధిత బ్యాంకు అధికారులు ముఖాముఖి జరిపారు. ఆయా గ్రామాల నుండి స్వయం ఉపాధి సోపానం పథకానికి బీసీ, ఓసీ, ఈబీసీ కార్పొరేషన్‌ల కింద 478 మంది దరఖాస్తు చేసుకోగా 339 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. ఈనెల 7వ తేదీన బల్లిపాడు, గుమ్మంపాడు, తిరుపతిపురం, వరిఘేడు, పాలి, మంచిలి, కంచుమర్రు, స్కిన్నెరపురం, పాలూరు, కొమ్మర, ఈడూరు గ్రామాలకు చెందిన వివిధ కార్పొరేషల్ కింద దరఖాస్తు చేసుకున్న 383 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.



అత్తిలిలో ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

సీ సేఫ్ ప్రోగ్రామింగ్ డేటా ఎంట్రీలో శిక్షణ

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సీ సేఫ్ ప్రోగ్రామింగ్‌లో భాగంగా డేటా ఎంట్రీకి సంబంధించి యూకే నుంచి వచ్చిన ప్రత్యేక బృందం శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా యూకే బృందం సభ్యులు జెనీఫర్, షాన్, గ్రేస్‌లు తల్లి, బిడ్డలు మంచి ఆరోగ్యంగా ఉండేలా చూసేందుకు ఎప్పటికప్పుడు వారి వివరాలకు సంబంధించిన ఎంట్రీలను పొందుపరచాలని సూచించారు. అనంతరం తల్లి, పిల్లల విభాగంలోని వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ నుంచి ఎంసీహెచ్ స్టేట్ మెంబరు నాగరేంద్ర, ఎంఎస్‌హెచ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రత్నవల్లి, ఆర్ఎంవో డాక్టర్ సాయిబాలాజీ, వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో యూకే బృందంతో వైద్య సిబ్బంది

బలుసులమ్మకు మహాకుంభ నివేదన

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద శుక్రవారం మహాకుంభ నివేదన (భారీ అన్నసమారాధన) జరిగింది. పులిహోర మిఠాయిలు చెర్రీ, ఇతర ప్రసాదాలతో అమ్మవారి ఇరవై అడుగుల ప్రతిమను సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం ముందు అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేశారు.

హ్యాండ్ రైటింగ్ పోటీలో జాన్వితక ప్రతిభ

పెంటపాడు: యూనివర్శల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ నిర్వహించిన చేతిరాత పోటీల్లో పదోతరగతి విద్యార్థిని కె. జాన్విత రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం ప్రత్తిపాడు సెంట్‌మేరీస్ ఇంగ్లీషుమీడియం స్కూల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈవో టీవీ రామకృష్ణ జాన్వితను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామకృష్ణ మాట్లాడుతూ చేతిరాతను విద్యార్థులు మెరుగుపరచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రెవఫాదర్ అమల్‌రాజు చేతుల మీదుగా ఈ అవార్డును జాన్వితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం

అత్తిలి: లయన్స్‌క్లబ్ ద్వారా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలలో క్లబ్ సభ్యులు భాగస్వాములు కావడం అభినందనీయమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు అన్నారు. అత్తిలి, రేలంగి లయన్స్‌క్లబ్స్, నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అత్తిలి మండలం మంచిలి భగవాన్ పూతరేకుల ఫ్యాక్టరీలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. నేత్రవైద్య శిబిరాన్ని జిల్లా గవర్నర్ పాపారావునాయుడు, డీసీ పర్విజన్ కేర్ వి మల్లిఖార్జునరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా అధ్యక్షుడు పాపారావునాయుడు మాట్లాడుతూ నేత్రాలు పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. లయన్స్‌క్లబ్ ద్వారా చేపడుతున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు శిరగాని నాగు దంపతులు ముందుకు వచ్చి రూ.49 వేలు వ్యయంతో ఈ నేత్ర వైద్యశిబిరం నిర్వహించడంపట్ల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శిరగాని భగవాన్, లయన్స్ క్లబ్ సభ్యులు ఉలుసు భాస్కరరావు, పట్నాల బాబు, యాతం రాంబాబు, దాసం బాబ్జి, వడ్డి కొండబాబు, కడలి రామాంజనేయులు, కలిగితి దయానందమూర్తి, గంగాధరం, రేలంగి క్లబ్ అధ్యక్షుడు హెచ్‌వీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



మంచిలిలో ఉచిత నేత్ర వైద్య శిబిరంలో మందులను అందజేస్తున్న దృశ్యం

ఇరువర్గాలపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: ఒకరిపై ఒకరు దాడి ఘటనలో ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆరుళ్ల గాంధీనగర్‌లోని చర్చి వద్ద పెండెం పృథ్వీతేజ, అతని స్నేహితుడు ఇంటి వెంకట్‌లు ఫోన్ చూస్తుండగా రాపాక పాటిరాజు అలియాస్ రాజ్‌కుమార్ మద్యం సేవించి గొడవపడ్డాడు. వెంకట్‌ను రాపాక పాటిరాజు కర్రతో కొట్టబోతుండగా అతను తప్పుకోవడంతో పెండెం పృథ్వీరాజ్ తలకు గాయమైంది. దీంతో అతనిని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు బాధితుడు పృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇంటి స్థలం వివాదాన్ని పురస్కరించుకుని రాపాక రాజ్‌కుమార్‌పై ఇంటి వెంకట్ రాడ్డుతో దాడి చేశాడు. ఇంటి దుర్గారావు, ఇంటి సుబ్బారావు, పెండెం పృథ్వీరాజ్‌లు చేతులతో తనను కొట్టినట్లు రాజ్‌కుమార్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సరికాదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును యధాతథంగా అమలు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం మాల మహానాడు కార్యాలయంలో తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంగరాజు మాట్లాడుతూ తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో ఉన్న ప్రభుత్వాలు కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.